


# మహాలక్ష్మి మహిమ

రంగడు తండ్రి చనిపోయాక, తల్లితో సహా మేనమామ రామయ్య ఇంటికి చేరాడు. గతి లేక తమ యింటికి చేరిన వారి యడల రామయ్యకు సదభిప్రాయం లేదు. అయితే, అతడి భార్య నాగమ్మ ఆడబిడ్డనూ, మేనల్లుణ్ణీ ఆప్యాయంగా చూచుకునేది.

నాగమ్మకు కూతురు కళ్యాణి తప్ప, వేరే సంతానం లేదు. కళ్యాణి పెరిగి పెద్దయ్యాక, తను రంగణ్ణి తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోనని ఖరాఖండిగా తల్లితో చెప్పింది. అది నాగమ్మకూ సంతోషదాయకమైన విషయమే!


ఈ విషయం తెలియగానే, మేనమామ రామయ్యకి ఒళ్ళు మండిపోయింది. రంగణ్ణి పిలిపించి, ఆ విషయాన్ని కదిపి చూచాడు. రంగడు కూడా కళ్యాణిని తప్ప మరొకర్ని పెళ్ళి చేసుకోబోనని చెప్పాడు.

రామయ్య కొద్దిసేపు ఏదో ఆలోచించి, "కళ్యాణిని పెళ్ళి చేసుకోవాలంటే నీకు నా ఆస్తి వ్యవహారాలన్నీ చూడగల స్తోమత వుండాలి. నీ తెలివితేటల సత్తా ఎంతో ముందు నేను తేల్చుకోవాలి. దానికి కొన్ని పరీక్షలు పెడతాను. వాటిలో నెగ్గితే, మీ ఇద్దరికీ పెళ్ళి చేస్తాను. ఒకవేళ నువ్వు ఓడిపోతే, నీ ముఖం నాకు చూపించకూడదు. ఈ షరతులు నీకు యిష్టమేనా?" అన్నాడు.

వెంటనే రంగడు రామయ్య షరతులు అన్నిటినీ అంగీకరించాడు.

"సరే, నేను రేపు పట్నం వెళ్ళి సాయంకాలాని కల్లా వస్తాను. ఆలోగా, చెరువు క్రింద వున్న మన పది ఎకరాలూ దున్ని వుంచాలి," అన్నాడు రామయ్య.

రంగడు తలవూపి, కొద్దిసేపు ఆలోచిస్తూ వుండిపోయాడు. అది చూచి, రామయ్య మీసం దువ్వుకుంటూ వెళ్ళిపోయాడు.



అయితే, మర్నాటి సాయంత్రం పట్నం నుంచి తిరిగి వస్తూనే రామయ్య చెరువు క్రింది పొలాని కెళ్ళి చూచాడు. రామయ్య తృప్తిపడే విధంగా పొలం చక్కగా దున్నబడి వుంది.

కళ్యాణికి అది చాలా ఆశ్చర్యాన్ని కలిగించింది. ఆమె రంగణ్ణి ఆ విషయం గురించి అడిగితే, ఒక్క రోజులో మహాలక్ష్మి మహిమ వల్ల, పది ఎకరాలు చక్కగా దున్నబడ్డాయని తెలియజేశాడు రంగడు.

ఆ తర్వాత, రామయ్య కన్ను గాలివానకు పొలం గట్టుమీద పడిపోయిన పెద్ద మర్రిచెట్టు మీద పడింది. రంగణ్ణి పిలిచి, దాన్ని తెల్లవారేలోగా, చిన్న చిన్న కట్టెపేళ్ళుగా కొట్టమని చెప్పాడు.

ఒక్క రాత్రిలో ఆ చెట్టును కట్టెపేళ్ళుగా కొట్టించటం అంటే మాటలు కాదు. రంగడు ఆ పనిని కూడా చక్కగా నిర్వహించటం రామయ్యకూ ఆశ్చర్యాన్ని కలిగించింది. రామయ్య దాని గురించి అడిగితే, పూర్వం కళ్యాణికి చెప్పినట్లే, 'మహాలక్ష్మి మహిమ' అని చెప్పాడు రంగడు.

ఇది తెలిసి కళ్యాణి కూడా ఎంతో సంతోషించింది. మూడవ పరీక్షలో కూడా నెగ్గితే తమ కోరిక ఫలిస్తుందని చెప్పింది కళ్యాణి.

ఈసారి రామయ్య చాలా కఠినమైన పరీక్షనే పెట్టదలిచాడు.

దాని ప్రకారం, మరునాటి సాయంత్రం రంగడు, ఆ చుట్టు ప్రక్కల బాగా ప్రసిద్ధికెక్కిన మల్లయోధుడు రత్తయ్యతో పోట్లాడి, అతణ్ణి చిత్తుచేయాలి. అదీ తన కంటి ముందే జరగాలని గట్టిగా చెప్పాడు రామయ్య.

రత్తయ్య సింహబలుడు. అతడి ముందు రంగడు ఏమాత్రమూ నిలిచి పోట్లాడలేడన్నది రామయ్యకు బాగా తెల్సు. ఆ ఊరిలోని వారందరి ముందు కూడా అది నిరూపించాలన్న వుద్దేశ్యంతో, ఊరిలోని చాలామంది పెద్దల్ని ఆ పోటిని వచ్చి చూడమని ఆహ్వానించాడు రామయ్య.

మర్నాడు సాయంత్రం పోటీ చూడటానికి చాలామంది వచ్చారు.

రామయ్య అందరికీ ఆ పోటీ వెనుక వున్న విషయమేమిటో తెలియజేయ సంకల్పించి, "ఈ మల్లయుద్ధంలో నా మేనల్లుడు గెలిస్తే, అతడికి నా కూతురు కళ్యాణిని యిచ్చి తప్పక పెళ్ళి


చేస్తానని మీ అందరి ముందూ చెప్పి, ప్రమాణం చేస్తున్నాను. దీనికి మా రంగడు కూడా ఒప్పుకున్నాడు. ఇందులో ఓడిపోతే తన తల్లితో సహా ఈ ఊరు వదిలిపెట్టి పోతాడుట,'' అన్నాడు.

"మా మేనమామ చెప్పినది నిజం. నేను ఈ పోటికి మనస్ఫూర్తిగా అంగీకరిస్తున్నాను. దీనికి మీరే సాక్షులు,'' అన్నాడు రంగడు నిర్భయంగా.

ఫలితం ఎలా వుంటుందో, అక్కడ చేరిన వారందరూ ముందుగానే వూహించారు. ఆ విధంగా మేనల్లుణ్ణీ, అతడి తల్లినీ వదిలించుకోవాలన్నది రామయ్య ఎత్తుగడ అనిపించింది అక్కడ చేరినవారందరికీ.

రత్తయ్యా, రంగడూ తమ తమ చేతులు కలపటంతో మల్లయుద్ధం మొదలైంది. రత్తయ్య మెరుపులా ఎగిరి పోట్లాడుతున్నాడు. కొద్దిసేపటికి, రంగడి నోటి నుంచి రక్తం వచ్చింది. అతడిలో పౌరుషం హెచ్చింది. తొడచరిచి రత్తయ్య మీదికి దూకి, అతణ్ణి గట్టిగాతోశాడు రంగడు. ఆ తోపుకు రత్తయ్య వెలికిలా పడ్డాడు. ఆ తర్వాత, తన మీద పడి రంగడు కొట్టిన దెబ్బలకు రత్తయ్య తాళలేక దాసోహం అన్నాడు. రత్తయ్య ఓడిపోయినట్లు నిర్ణయించారు న్యాయనిర్ణేతలు. అది చూచి, రామయ్యతో సహా అందరూ రంగణ్ణి మెచ్చుకున్నారు. అప్పుడు కూడా కళ్యాణి అడిగితే, అదంతా మహాలక్ష్మి మహిమే అన్నట్లు మాట్లాడాడు రంగడు.

రంగడికీ, కళ్యాణికీ వైభవోపేతంగా పెళ్ళి అయిపోయింది.



ఆ తర్వాత, ఒకరోజు కళ్యాణి భర్త రంగణ్ణి చూచి, "మా నాన్న పెట్టిన పరీక్షలలో ఎలా నెగ్గావో అర్థం కావటం లేదు. ఎప్పుడు అడిగినా అంతా మహాలక్ష్మి మహిమే అన్నట్లు చెపుతూ వచ్చావు. ఇప్పటికైనా నాతో నిజం చెప్పరాదా?" అన్నది.

దానికి రంగడు నవ్వి, "ఇందులో, అర్థం కాని దేముందీ? మహాలక్ష్మి అంటే ధనం కదా! మహాలక్ష్మి మహిమ అంటే ధనమహిమ అన్న మాట! ఎక్కువ మంది కూలీలను పెట్టి పది ఎకరాలను దున్నించటంలో కాని, మర్రిచెట్టును చిన్న చిన్న ముక్కలుగా కొట్టించటంలోకాని, చివరికి మల్లయోధుడు రత్తయ్యను చిత్తు చేయటంలో కాని ధనం తన మహిమను చూపింది. ఎటొచ్చి రత్తయ్య మాత్రం తాను ఓడి పోవటానికి ఒక పట్టాన ఒప్పుకోలేదు. మూడు వందల వరహాల ముడుపుతో అతడి బింకం సడిలింది. అయితే, అందరూ నమ్మేందుకు కాను, నాకు కొన్ని మెళుకువలూ, పట్లూ నేర్పించాడు రత్తయ్య. అందువల్ల, మా పోటి రక్తి కట్టింది కూడా," అంటూ వర పరీక్షలో తానెలా నెగ్గుకుని వచ్చాడో వివరించాడు.

"ఇంత డబ్బు ఎక్కణ్ణుంచి తెచ్చావు?" అని అడిగింది కళ్యాణి.

"షావుకారు సుబ్బిశెట్టి నన్ను నమ్మి వేయి వరహాలు అప్పు యిచ్చాడు. అలక పాన్పు మీద కూర్చుని మీ నాన్నగారి నుంచి వసూలు చేసిన డబ్బు అప్పు తీర్చటానికి సరిపోయింది. ఈ విధంగా మన కోరిక తీరింది," అన్నాడు రంగడు.

దానితో 'మహాలక్ష్మి మహిమ' అన్న తన భర్త మాట వెనుక ఎంత కథ వుందో అర్థమైపోయింది కళ్యాణికి.

